నాకు నచ్చిన నా కథ

నా ఇరవైయవ ఏట మొదటి కథ రాసేను. అది "భారతి" మాస పత్రికలో అచ్చయింది. 1952 నించి 1981 వరకూ నేను రాసిన కథలు కేవలం అరవై. వాటిలో నాకు నచ్చిన కథలు "నిద్ర పోయిన దేశం", ...

ఇంక కథలు రాయటం గురించి, రచనా ప్రక్రియ గురించి కొద్దిగా ప్రస్తావిస్తాను. రాయాలన్న తహతహ ఉన్న వ్యక్తికి రాస్తూ ఉంటే ఆ తహతహ ఎక్కువౌతుందే తప్ప తగ్గదు. ప్రచురితం అవుతున్న కొద్దీ ఆ తృష్ణ ఎక్కువౌతూ వెళ్తుంది. రచయిత ఒక ధ్యేయం పెట్టుకోకుండా ఏ ప్లాటు తడితే దాని మీద రాసుకుంటూ పోతే కథల్లోని నాణ్యత తరుగుతుంది. ఒక ప్లాటు తడితే వెంటనే డైరీలో రాసుకొని, ఒకటి రెండు నెలల్లో పోయాక, వాటిల్లోంచి మంచిది ఎన్నుకొని కథ రాస్తే బాగుంటుంది. రాసిన కథని డ్రాయర్లో ఉంచి, రెండు నెలలో పడేసి ఉంచి, తరవాత చదువుకొని, బాగుందనిపిస్తే మిత్రులకి చదివి వినిపించి, వారి సలహాలు నచ్చితే పాటించి కథ అప్పుడు ఫెయిర్ చేసి పంపడం మంచిది. కథ 'బాగుంది అన్న వారికన్నా కథలో లోపాలని ఎత్తి చూపగలిగే వారే ఆప్తులని భావించాలి!'

ఏ కథన్నా, నవలన్నా మానవుణ్ణే ముందుకు తీసుకు వెళ్లాలి కాని వెనక్కి కాదు. మూఢనమ్మకాలూ, కులతత్వాలు, మతమౌఢ్యాలు, దెయ్యాలు, భూతాలు, చేతబడులు, అంధయుగపు ఆచారాలు, సాంప్రదాయాలు, ధన మదాంధత, అధికార మదాంధత, భూకామందుల అరాచకం వీటికి ప్రాణంపోసే రచనలు చేసే రచయితలు తమకు తాము ఆత్మవంచన చేసుకోడమేకాక, ప్రజల్ని కూడా తప్పుదారిన పట్టిస్తున్నారని నా అభిప్రాయం. ఇటువంటి రచనలు చేసే కన్న ప్రేమకథలు ప్రేమనవలలూ రాయడం వెయ్యి రెట్లు నయం! బరువు రచనలు వద్దు, తేలిక రచనలే కావాలని, అటువంటి రచనలనే ప్రోత్సహించే ప్రచురణా పరిశ్రమకి పాఠకుల తరపున నా మనవి. "కొత్తదనానికి తావివ్వండి.

ప్రగతి ప్రథాన్న పాఠకులని ఆలోచింపచేసే బాధ్యత మీకు కూడా ఉంది- రచయిత చూపదలుచుకున్న ప్రపంచాన్ని, పాఠకుడికి కన్పడేటట్టు చేసే కిటికీ మీరు! స్వార్థంవేపు ఉండే కిటికీని మూసేయకండి!

— *మంథా వెంకట రమణారావు*

నిద్రపోయిన దేవుడు

మొదటి ఆట సినిమా ఆరంభం అయినట్టుంది. ఆ సెంటరులో ఉన్న నాలుగు హాల్సులో నుంచి విడిరికార్డుల సంగీతం వినిపించడంలేదు.

ఆ ప్రదేశం రద్దీగా వుంది- ఏలూరు బందరురోడ్డు కలుస్తున్న సెంటరది. కృష్ణ కాలవమీంచి మరొక దారి, నేనూ ఉన్నానని మొహమాటపడుతూ వాటిని కలుస్తోంది.

ఆ ప్రదేశమంతా, అందంగా అలంకరించుకొని పోతున్న స్త్రీ పురుషులతో మ త్తెక్కి ఉంది. ఒకరి మీద ఒకరు ఒరిగి, నవ్వుకుంటూ కార్లలో పోతున్నారు, ఒకర్నొకరు అంటిపెట్టుకొని స్కూటర్లమీద పోతున్నారు. ఏవో కబుర్లు గబ గబా చెప్పేసుకుంటూ నవ్వేసుకుంటూ రిక్షాలలో పోతున్నారు. అన్యోన్యత, ప్రేమ అంటే ఇదే సుమా అని రోడ్డుమీదపోయే ఏకాకిగాళ్ళకి భ్రమ కలిగిస్తున్నారు.

జారిపోయే పైటలు పీలికల్లా క త్తిరించబడ్డ రవికలు, అవి బయటపెట్టే స్త్రీల సోయగాలు పలుచటి రవికలగుండా వెనుకనించి కనుపించే బ్రాసరీల బెల్టులు, మెడమీదికి జాలువారే మల్లెపూల దండలు, అతివేగంగా కనుపించి మాయ మౌతున్నాయి— ఆ ప్రదేశాన్నంతా ఒక విధమైన మైకపు వాతావరణంలో ముంచుతూ.

అక్కడున్న పూల అంగళ్లలో రాసులుగా పోసిన మల్లెలు, మరువం, దవనం, గులాబీపూలు సువాసనలు వెదజల్లుతూ చాటుతున్నాయి అందాన్ని కొనుక్కోమంటూ.

ఆ జనసందోహం చల్లటిగాలి, పూలపరిమళం, మెరుపుల్లా మెరిసిపోయే స్త్రీపురుషుల జంటలు ఇవన్నీ ఆ వాతావరణంలో లిప్తకాలమైనాసరే ఇరుక్కున్న ప్రతి ఒంటరి వ్యక్తిలోనూ తియ్యటిబాధ ఏదో భావోద్రేకం ఒంటరితనం అంటే విరక్తిని కలిగిస్తున్నాయి.

ఈ "చిన్న" రహదారి మాత్రం రద్దీగా లేదు. ఇది కృష్ణకాలవని ఆనుకొని ఉంది. వీధి పొడుగైనదే కాని, ఉన్నవి రెండే కాంతిలేని విద్యుద్దీపాలు- ఆరోడ్డు నిశ్శబ్దమే కాని, నిర్జనం కాదు. కాలినడకని వచ్చిపోయే జనం మాత్రం ఎక్కువగానే ఉన్నారు.

రోడ్డు కిరువైపులా ఉన్న ఇళ్ళు మట్టిగోడలు తాటికమ్మలవి వాటికి కొత్త ముందుగా పూర్తిగా తాటికమ్మలతో కట్టిన చిన్న పాకలు గడ్డికుప్పల్లా ఉన్నాయి.

ఆ వీధిలో, మున్సిపల్ దీపానికి వీలైనంత దగ్గరగా, తాటికమ్మల పాక ముందు నిల్చుంది కాళింది.

పడీపడనట్టుండే ఆ దీపాల వెలుగులో ఒక స్త్రీమూర్తి అక్కడ నిల్చుంది అని పోల్చుకుందుకి మాత్రం అవకాశం ఉంది- పొడుగైన మనిషే సన్నంగా ఉంది; ముఖం కోలగా ఉంది. అందమైనదే అయిఉండొచ్చు నల్లగా ఉందో చామనఛాయో కళ్ళు అందమైనవో కావో ఇవన్నీ కాస్తదూరాన రోడ్డుమీద పోతూ ఆమెను చూసి ఆమె గురించి ఆలోచించిన వ్యక్తి ఊహించుకోవల్సిందే.

సైకిల్ హాండిల్‌బారుకి ఒక వెదురుపూల సెజ్జ తగిలించి వచ్చిన యువకుడు, సైకిలు వేగం తగ్గించి, సజ్జలోంచి ఒక మల్లెపూలదండ తీసి కాళిందిమీదికి విసిరాడు—అందుకు తయారుగా ఉన్న కాళింది దండ అందుకొని, కొప్పులో ముడుచుకుంది.

"డబ్బులిస్తావా? పద్దు యాభై పైసలవరకూ పెరిగిపోనాది, ఈ దండతో" అన్నాడు కుర్రాడు, కాలు నేలకి దన్నుపెట్టి, సైకిలుమీదనే కూర్చొని.

ఒక రాగం వాయించేముందు, వీణాతంత్రులు మీటుతాడు వాద్యగాడు- ఆ స్వరశబ్దాలు, అసలు రాగంకన్నా హాయిగా వినిపిస్తాయి. కాళింది మాట్లాడినప్పుడు ఆ కంఠస్వరం, ఆ స్వరశబ్దాలంత హాయిగా వినిపించింది. గొంతు హాయిని కలిగించినా, ఆ పలుకుల అర్థం అపశ్రుతి పలికింది- "లేదు రాజూ, మరో రోజు ఓపికపట్టు" వినీవినిపించనట్టు అంది కాళింది.

"ఇవాళకూడా బోణీ పడనేదా?" రాజు అన్నాడు. ఇంక ఈ మనిషికి పువ్వులు అరువివ్వడం ఉత్త దండగే అని ధ్వనించే గొంతుతో.

కాళింది జవాబివ్వలేదు. అడ్డంగా తల ఊపింది. కుర్రాడి గొంతులో ఆశాభంగం కాస్త విచారం ధ్వనించేయి. పైడయ్యని టీ తాగడానికి డబ్బులడిగితే నీ దగ్గర బాకీ వసూలుచేసి కర్చుపెట్టుకోమన్నాడు."

కాళిందికి రాజు మీద జాలేసింది. ఎంతో కలుపుగోలు మనిషి. ఏ పని

చెప్పిన కాదనకుండా చేస్తాడు. సాయపడదామని, మంచివా డనిపించుకుందామని ప్రయత్నిస్తాడు. కాళింది సాదరంగా అంది. "రాజా నాయరు హోటల్లో నా పద్దులో రాసి టీ తాగు_ నీ బాకీలో చెల్లుకొట్టన్లే!"

రాజు పకాల్న నవ్వేడు. "ఆ పనీ అయింది_ అక్కడ కూడా ఐదుపైచిల్లర వరకూ పెరిగిపోయిందిగా నీ పద్దు. టీ కాదు, గలాసుడు మంచినీళ్ళన్నా ఇవ్వనన్నాడు నాయరు నీ పద్దుమీద. సరే. ఉన్నప్పుడే తీర్చు" ఆ మాటలని, పూలదండలు చీకటిలోకి ఇటూ అటూ విసురుతూ పోయేడు. చీకటి ముసుగులో దాగున్న కాళిందిలాటి ఆకారాలు వాటిని అందుకున్నాయి.

కాళింది కళ్ళలో నీళ్ళు తిరిగేయి. అవి రాలి చెక్కిలిమీద పడలేదు. కనుకొలకులలోనే ఇంకిపోయేయి_ నీరసంవల్ల కాళ్ళు వణుకుతున్నాయి.

నిల్చొని గంటకిపైగా గడిచింది. కాళ్ళు బాగా పీకుతున్నాయి. వెనుకనున్న పాకలోకి పోయి, మంచంమీద వాలి కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని మనసు తహతహ లాడింది. కాని రావల్సిన డబ్బు చెయిజారిపోవచ్చు. అలా అనుకొనే విశ్రాంతి తీసుకుందుకి భయపడుతూనే, నిన్నా మొన్నా రెండో ఆట వదిలి మనుషులంతా ఎవరిళ్ళకు వాళ్ళుపోయి ఆఖరికి రోడ్లమీద కొట్లాడుకునే ఊరకుక్కలు మిగిలేవరకూ నిల్చుంది. ఫలితం లేకపోయింది.

నిన్న రాత్రి నిద్రపట్టలేదు. బాబు ఒంటిమీద చెయ్యివేసి మంచంపక్కనే కూర్చుంది. బాబు రాత్రల్లా కలవరిస్తూనే ఉన్నాడు. జ్వరం ఏమీ తగ్గలేదు_ పొద్దున్న కళ్ళువిప్పి తనకేసి చూసేడు జాలిగా_ ఏడుపొచ్చింది. "ఆకలేస్తోందా బాబూ! జావ తాగుతావా!" _ద్రాక్షపళ్ళు కావాలన్నాడు. ఎక్కడా రూపాయి అప్పుపుట్టలేదు. తన పెళ్ళినాడు, మగపెళ్ళివారికి పానకం బిందెలంటూ నాన్న పెట్టిన చిన్న ఇత్తడిగిన్నె అరిగిపోయి, చిల్లులు పడి, మూలన ఉన్నదాన్ని మూడు రూపాయల కమ్మి, బాబుకి పళ్ళు, డాక్టరు రాసిచ్చిన మందు మాత్రలు కొని తెచ్చింది. కాని సాయంత్రానికి జ్వరం మళ్ళీ తిరగబెట్టింది.

చేతిలో రెండు రూపాయలు పెట్టనిదే ఆ పేటలో ప్రాక్టీసుపెట్టిన L M P డాక్టరు రానన్నాడు. కాళ్ళు పట్టుకోగా, వచ్చిచూసి ఇంజక్షన్లు కొనుక్కురమ్మని చీటి రాసిఇచ్చేడు. తన దగ్గర అవి లేవన్నాడు. రేపింక డబ్బు చూపనిదే కుర్చీలోంచి లేవడు.

నిల్చొని ఒక గంటన్నా గడవందే మొహం తిరుగుతోంది. పగలు ఎండ బాగా కాసింది. చీకటిపడినా వేడి తగ్గలేదు. రోడ్డుమీద వచ్చిపోయే జనం రద్దీ

తగ్గింది. సినిమా ఆరంభం కాకముందు, అవగానే ఒక అరగంట వరకూ చాలా మంది ఇటూఅటూ తిరిగేరు. ఒకరిద్దరు దగ్గరగా వచ్చేరు. అలాగా ముందుకి వెళ్ళగానే పలాయనం. నోరెత్తి పిలవడం అంటే ప్రాణం పోయినట్టయింది. ఆ మాటలు తనకి చేతకావు. మహా ఐతే చిన్న పొడిదగ్గు దగ్గుతుంది ముందుకెళ్ళిం. అంతకన్న దిగజారిపోలేదు.

నవ్వుకుంది జాలిగా–ఇంకా ఏం దిగజారిపోవాలి– ఆ నవ్వు పైకి వినిపించక పోయినా, భయంకరంగా మారి మనసుని దొలిచింది– ఆ దొలిచిన మనసులో తనని, కొడుకుని వదిలి, నాటకాలదానితో మద్రాసు పారిపోయి మరి కనుపించని తనకు పుస్తెకట్టి అగ్నిసాక్షిగా పెళ్ళాడిన మనిషి కనుపించేడు. "నేను దాంతో పోతున్నాను. ఇంక నీకూ నాకూ ఏమీ సంబంధం లేదు–నువ్వెలాపోయినా పో!" అని నిర్మోహమాటంగా చెప్పి జాలే కనికరం లేకుండా నష్టేట తన్ను మించిన మనిషి ఆ క్షణం ఒక్కసారి మెదిలేడు. ఆ మనిషి మరిలేడు. ఆ అదది, ఎక్ట్స్ట్రా వేషాలు సంపాదించుకొనే తాహతుకి వచ్చేక ఇతన్ని తరిమేసేక స్టూడియోల చుట్టూను మద్రాస్ రోడ్లమీదా పిచ్చివాడిలా ఏళ్ళతరబడి తిరిగి క్షయవచ్చి దిక్కుమాలిన చావు చచ్చేడు– తన వావలేకుండా ఇలా దిక్కుమాలిన బతుకు బతుకుతున్నది.

ఎదురుగా పాకముందర నిల్చున్న స్త్రీ కాళిందిలా ఊరుకొని దిక్కులు చూడటంలేదు. రోడ్డుమీదపోతున్న అందర్నీ మెల్లిగా పలకరిస్తోంది. "ఇదుగో అబ్బాయ్ నిన్నే! ఇలారా! ఒక్క మాటేను." కొన్ని పదాలు నేర్చిన చిలకలా అవే మాటలు పదేపదే వచ్చిపోయేవాళ్ళని చూసి అంటోంది. పల్లెటూరి నించొచ్చిన రైతులా ఉంది. నోట్లో చుట్ట, చేతిలో సంచీ, సగం చేతుల బనియన్ వేసుకొని పంచ కట్టాడు. కొత్త తటపటాయిస్తూ నిల్చున్నాడు. వెంటనే ఆమె అతన్ని రెక్కపట్టుకొని చీకటిలోకి లాగుకొని పోయింది. రైతు అడుగుతున్నాడు "ఎంతేవిటి! నా దగ్గర మూడ్రూపాయలే మిగిలినాయి. రెండు రూపాయలు పొద్దుట కారు కివ్వాలి. నీకు రూపాయికన్న ఎక్కువివ్వను!" కొత్తవాడిలా ఉన్నాడు. భయపడుతున్నాడు. "ముందు రావయ్యా" అని పోతుని పులి ఎగరేసుక పోయింది ఆ పాకలోకి.

పక్కనే కొద్దిదూరంలో ఉన్న పంకజం కాళింది దగ్గరికి వచ్చింది. నవ్వుతూ అంది "సాయిత్రికి తగిలింది మంచి బేరం. సచ్చుమొహం వాడునూ బొడ్డుకాడ దాచుంటాడు నోట్లకట్టలు. మూడురూపాయలే ఒట్టుకుని ముండమొకం సూద్దాని కన్నా దయర్యముంటాదా ఆ చచ్చినోడికి?"

కాళింది నవ్వడానికి ప్రయత్నిస్తూ అంది. "నువ్వేం తక్కువదానివా" ఆ మాటకి పంకజం పొంగిపోయింది గర్వంతో. కాళింది భుజంమీద చెయ్యివేసి కళ్ళలోకి చూసి అంది "ఏటింత నీరసంగా వున్నావ్ ఏది సూడనీ? ఏటయింది ఒంట్లో బాగులేదా?"

ఈ మాటలకి కాళింది కళ్ళ వెంబడి నీళ్లు బొటబొట రాలాయి.

"ఈయేళ కూడు తిన్నేదా!" పంకజం అడిగింది ఆత్రంగా.

"బాబుకి మూడురోజులై జ్వరం. ఒకటే కలవరింతలు. ఎలాగుందో? మందు కొనాలి, డాక్టర్‌కి ఫీజివ్వాలి. ఏమిటో పంకజం దేవుడు నన్ను తీసుకుపోతే బాగుణ్ణు- ప్రాణం తీసుకుందుకి నాకు ధైర్యంలేదే- బాబు మొహమే కళ్ళకు కడుతోంది- వాడ్ని పెంచి పెద్దచేసి, ఏదో చెయ్యాలని ఉంటుంది- అదంతా అయే పనా!" గాద్గదిక స్వరంతో అంది కాళింది.

పంకజం కోపంగా అంది, "అయితే నిన్నటికాడ్నించి ఏటీ తిన్నేదన్న మాట- మడిసివి బాగుంటే కదా డబ్బులు సేతికొస్తాయి- ఊదితే ఎగిరిపోయి నట్టుంటే అయినట్టే- ఉండు టిఫిన్ తెస్తాను." అంటూ పంకజం ఆ వీధి మొగలో వున్న నాయరు హోటలుకేసి నడిచింది- చేతిలో ఒక పొట్లంతో తిరిగి వచ్చింది- కాళింది చేతిలో ఉంచుతూ అంది. "మాసం సేపలు కాదులే- మీ బాపనోళ్ళు తినేవే- పూరీలు, మసాలా కూరా తెచ్చాను తిను "

ఆ ఆత్మీయతకి కాళింది వెక్కివెక్కి ఏడ్చింది- పంకజం బలవంతంచేసి తినిపించింది- తిన్నాక కాస్త ప్రాణం కుదుటపడింది- రెండు రోజులై మంచి నీళ్ళే అహారమయ్యేయి. నిన్నరాత్రి దయతలిచి నాయరు ఒక కప్పు టీ ఇచ్చేడు.

పంకజం తన జాగాకి పోయింది. తైటు ప్యాంటు, ఎర్రటి బుష్‌షర్టు, మెడ చుట్టూ రుమాలు చుట్టుకొని అక్కడ ఆగిన ఒక యువకుడ్ని ఆకర్షించడానికి ప్రయత్నిస్తూ "ఇదిగో అబ్బాయ్ ఇలా రా ఇటు అట్టా యిస్సిత్రంగ సూత్తావేం ? యేవూరు మంది" అని లాలించింది. ఆ యువకుడు ఒక చిరునవ్వు నవ్వి, ఆమె వేసిన వలనించి తప్పించుకొని ముందుకుపోయేడు. ఆ వల ఆ ఎర్రలాల్చీ అబ్బాయికైతే తగల్లేదు కాని, ఆ వెనకనున్న ఆసామీకి తగిలింది. మధ్యపాపిడి తీసుకున్న మధ్యవయస్కుడు, జుత్తు అక్కడక్కడ పండిపోయింది. "యెంతిచ్చుకుంటావేటి?" అన్నాడు. పంకజం పెంకిగా అడిగింది "ఎంతిస్తావేటి?" అతడేం తక్కువ తినలేదు. "ఎంతడుగుతే అంత!" అని, ఛలోక్తికి నవ్వుకున్నాడు. "గట్టోడివే! నాలుగున్నయ్యా!"



అంది. "ముష్టోడి ననుకున్నావా బంగారు పిసికా!" అంటూ ఆమెను సమీపించి. నడుంచుట్టూ చెయ్యివేసేడు. పంకజం గలగలా నవ్వింది.

కాళింది కాస్త ముందుకు జరిగింది, దీపం కాంతి బాగా పడేటట్టు తనమీద. ఆ నాలుగు రూపాయలూ తనకే దొరికిఉంటే, ఈ అవద గట్టెక్కి ఉండును. కాని తనకి ఆకర్షించే శక్తి పూర్తిగా పోయింది. తన్నుతాను మోసంచేసుకొని లాభంలేదు. బలంలోను, పుష్టిలోనూ, యవ్వనంలోనూ, ప్రచండమైన ఆకర్షణ శక్తి ఉంది. అందం కొద్దిగానే వున్నా, అవుంటే అది నూరు రెట్లు ఎక్కువ అవుతుంది. అందం ఎంతఉన్నా అవి లేకపోగానే నూరురెట్లు తగ్గిపోతుంది. "ఇపుడు నువ్వు రెండో కోవకి చెందుతావు కాళింది" అని అన్నాడు, తనని వదిలిపోయే ముందు తనకి ఒకనాడు పుస్తెకట్టిన ఆ మగాడు.

బాబుని పెంచి పెద్దచెయ్యాలి. పనికోసం సహాయం అర్థిస్తే వాళ్ల సహాయం చేసేముందు కోరేది, నోటితో అనకపోయినా, చూపులతో తనని_ పుట్టినింట ఎవ్వరూ లేరు. తండ్రి కళ్ళుమూసేడు. తల్లి చిన్ననాడే పోయింది. సవితితల్లి తన అన్నదమ్ముల దగ్గరికి పోయింది తన పిల్లలతో.

"నా మాటినుకో అమ్మా! ఆ రెడ్డిబాబున్నాడే, నిన్ను బాగా సూసుకుంటా నంటున్నాడు. నెలకి రెండొందల వరకూ ముట్టజెబుతాడు. ఆడికేం నేదాపోదా? నీమీ దాడికి బెమ కలిగింది. ఎవడో ఒక మొగాడ్ని నమ్ముకోడం నీకు సేమం."

ఇలా, తన ఇంట్లో ఒకనాడు పనిమనిషిగా ఉన్న రంగి సలహా ఇచ్చింది. ప్రాణం పోయినా ఒప్పుకోనంది. కాని కొడుకుకోసం బతకాలి. మమకారం ఆ పట్టుని సడలించింది. రెండేళ్లు బాగానే గడిచేయి. రెడ్డి గుండెపోటొచ్చి చావడంతో మళ్ళా మొదటికే వచ్చింది పరిస్థితి. అపుడు మళ్లా రంగిమాటే వినవలసి వచ్చింది. రంగే మధ్యవర్తిగా మనుష్యులని ఇంటికి తెచ్చేది. రానురాను ఆరోగ్యం బాగా దెబ్బతింది. బలం, పుష్టి హరించుకపోయేయి.

యౌవనం అనబడే కాలం తనకి నడుస్తున్నా, బలం, పుష్టి హరించుక పోయేయి! బాబుకి జ్ఞానం కలగడంతో అక్కడొక బస, ఇక్కడొక బస ఏర్పాటు చేసుకోవలసివచ్చింది. ఒకప్పుడు తనని వెతుక్కుంటూ వచ్చేవాళ్లు మగాళ్లు. ఇపుడు వాళ్ళకోసం తను వెతుక్కుంటూ వెళ్ళవలసి వచ్చింది.

మొదటి ఆట సినిమా వదిలే వేళయింది. కాళింది మనసులో భయం, ఆందోళన, ఆతృత ఎక్కువయేయి. కనీసం నాలుగు రూపాయలు దొరికినా, మందుకి, పళ్ళకి సరిపోతుంది. నాలుగు రూపాయలు! అంటే కనీసం ఇద్దరు మనుష్యులు, లేదా నలుగురు తొమ్మిది దాటుతోంది. ఒక్క మనిషీ తనవేపు చూడ నన్నాలేదు.

చీకటిలో నిల్చున్న తన నిజరూపం వాళ్లు పసికట్టేస్తున్నారు. కాళిందికి దుఃఖం ఆగడంలేదు కాని ఏడుస్తూ నిల్చుంటే, దగ్గరికి రాకపోవడమే కాదు, ముష్టన్నా వెయ్యరు. ఏడ్చే మనుష్యులని అసహ్యించుకుంటుంది ప్రపంచం. వాళ్ళని వదిలి పరుగెత్తుకపోతుంది లోకం. నవ్వగలుగుతే నవ్వు. అ దువల్ల లాభంఉండొచ్చు, లేకపోవచ్చు, కాని పరుగెత్తుకపోరు. తిట్టినా, కొట్టినా, లాభించినా, అసహ్యించుకున్నా, ఆఖరికి చంపబోయినా నవ్వుతూనే ఉండడం నీ గతి! కోపం చూపించే హక్కు నీ కసలే లేదు. కసి చూపే హక్కు, తిట్టే హక్కు అంతకన్నా లేదు. ఈ లోకంనుంచి, నీకోసం ఏం కావాల్సినా, ఏ రూపంలో కావాల్సినా, అందుకుతగ్గ ప్రతిఫలం ఇవ్వడానికి తయారుగా ఉన్నా, నవ్వుతూనే ఎప్పుడూ వుండడం, నవ్వుతూనే ప్రాధేయపడటం, నవ్వుతూనే నీ బ్రతుకీడ్చు కాళిందీ" అనుకుంటూనే ఉంది కొన్ని సంవత్సరాలై, ప్రతిరోజూ.

మొదటిఆడ సినిమా వదిలేసేరు. కార్ల చప్పుళ్లూ, స్కూటర్ల చప్పుళ్లూ, రిక్షాల గంటల గణగణలు వినిపిస్తున్నాయి. రద్దీఅంతా ఆ రోడ్లమీదే కాలి నడకని పోయేవాళ్ళంతా ఈదారంటే వెళ్తున్నారు. సినిమా యాక్టర్ల గురించి వాదులాడుకుంటున్నారు. "ఆ దేక్టింగ్ అడిదే. ఈదేక్టింగ్ ఈడిదే. ఆడి దీడికిరాదు ఈడి దాడికిరాదు" దాంతో సందేహాలన్నీ తీరిపోయినట్టు నోరెత్తలే దెవ్వరూ.

కాళింది ధైర్యంచేసి ముందుకొచ్చింది. ఈ నలుగురిలోనూ వెనుకనున్న వ్యక్తిని పలుకరించింది తెగించి. "ఏవండీ! చిన్నమాట!" ఆ వ్యక్తి కాళిందివేపు చూసి ముందరికి పరుగున వెళ్ళి తక్కినవాళ్ళతో అన్నాడు. "ఇదేంటి గురూ! మీదికొచ్చేస్తుందెవర్తో!" అంటూ. అందరూ నవ్వేరు. "ఓరి ఎర్రిమొహమా! మరేం పెళ్ళిజేసుకుంటావురా రేపు? అదెవర్తో తెలీదంటరా? అసలు సిసలు సరుకురా బుల్లోడా! ఇది పల్లెటూరనుకున్నావేటి? ఓ సూపు సూస్తావేటి?" అని చెళుకు విసిరేడు. "ఛీ! ఛూత్!" అని కాండ్రించి ఉమ్మేడు బుల్లోడు.

ఆ మనిషి తన చెంపమీద ఛెళ్ళున కొట్టినట్టు బాధపడింది కాళింది. దుఃఖం పొంగిరాగా గిరుక్కున తిరిగి, వెనుకనున్న పాకలోకి పోయి వెక్కి వెక్కి ఏడుస్తూ మంచంమీద కూలబడింది. అవమానం ఒక ప్రక్కనించి, కొడుకు గురించి బెంగ, మరొక ప్రక్కనించి ఆమె మనసుని తుఫాను ఊపినట్టు ఊపేయి, ఏడుస్తూనే నిద్రపోయింది.

కుక్కల అరుపులకి తెలివొచ్చింది కాళిందికి. ఉలిక్కిపడి లేచి బయట కొచ్చింది. వీధి నిర్మానుష్యంగా ఉంది. స్నేహితురాళ్ళంతా ఇళ్ళకి పోయి నట్టున్నారు. రెండో ఆటకూడా వదిలేసేరో ఏమిటో. ఒక రిక్షావాడ్ని అడగ్గా ఇంకా వదల్లే దన్నాడు.

రెండో ఆట అయ్యేవరకూ ఉందామనుకుంది. వెన్నెల బాగా కాస్తోంది. వీధి దీపాలకన్నా వెన్నెలే వెలుగునిస్తోంది

కాళింది చెవులు ఇంతలో బూట్లచప్పుడు పసిగట్టేయి. పోలీసువాడు కాదు గదా? భయంవల్ల నీడలోకి పోయింది. దొరికిందా, ఇంటికి వెళ్ళటం జరగదు. వారం రోజులవరకు ఇంటికి వెళ్ళటం పడదు. ఇంకా ఎక్కువ కాలమే పట్టొచ్చు ఈ మధ్యని బాబు తనకోసం కలవరించి దిక్కుమొక్కూ లేక ప్రాణాలు వదుల్తాడు. ఛీ! అన్నీ పాడు ఆలోచన్లే వస్తున్నాయి.

బూట్ల సడి దగ్గరయింది. ఒక పొడుగాటి మనిషి వచ్చి, పాకముందు వేగం తగ్గించేడు. బతికేం, పోలీసుకాదు! అనుకుంది. నీడలో ఉన్న తనని పసికట్టి నట్టుంది. నిలబడి, పొడిదగ్గు దగ్గేడు.

కాళింది ముందుకొచ్చింది. జంకుతూ అడిగింది "ఏం కావాలి?"

అతడామెను అనుమానంగా చూస్తూ అన్నాడు. "నువ్వు కావాలి!" ఆ గొంతు ఆగిపోయిన గ్రామఫోను రికార్డులా సప్తస్వరాలూ పలికింది.

ఒక పెద్ద బరువు తగ్గినట్టు నిట్టూర్చి కాళింది అంది "ఇలా రండి!"

అతడు ముందుకు వచ్చి కాళింది చెయ్యి పట్టుకొనిఅన్నాడు "ముందు ఆ హోటల్‌కి వెళ్ళి టీతాగివద్దాం పద- టీ తాగితేనేగాని వేడెక్కదు," అంటూ ఆమెను రోడ్డుమీదికి లాగేడు.

విటుడ్ని వెంటేసుకుని టీ దుకాణానికి వెళ్ళడం కాళింది కిష్టంలేదు. అంతా అదోలా చూస్తారు. తను ఒంటరిగానన్నా వెళ్తుంది లేదా పంకజం తోడువచ్చేది. కాని ఇవాళ తప్పేట్టులేదు. నాయరు బాకీ డబ్బు అడుగుతాడు. అవమానిస్తాడేమో!

భయపడుతూనే వీధిమొగలో నున్న టీకొట్టుకి వెళ్ళింది అతడితో.

"నీ పేరేంటి?" అడిగేడు యజమాని దాసిని అడిగినట్టు.

"కాళింది." కాళింది మనసు ఇంటిమీదే ఉంది. ఈ మనిషిని ఎంత వేగం పంపిచేస్తే డబ్బుతీసుకుని అంతవేగం ఇంటికి వెళ్ళొచ్చు కాని డబ్బుగురించి ప్రస్తావన రాలేదు. ఎంతిస్తాడో అడగడానికి మొహమాటం, భయం. వెంటనే నువ్వు అక్కర్లేదు అని పోతే! మనిషి మంచివాడిలానే ఉన్నాడు.

"నీది ఈ ఊరేనా?"

"ఈ ఊరే."

"నీ వయసెంత?"

"పాతిక" నిజం చెప్పింది. అబద్ధం చెప్పాలంటే దొంగతనం చేసినట్టే ఉంటుంది

"మాంచి వయసులోని గుంటనాగ అగపడతున్నావ్" అన్నాడు. సారా వాసన!

కాళింది ఆ పొగడ్తకి పొంగిపోలేదు.

టీ దుకాణం కాళీగానే వుంది. నాయరు ఇద్దర్నీ చూసేడు- కానీ కాళిందిని ఏమీ అనలేదు. మాసిపోయి, మసిబట్టిన లుంగీతో, పండువెంట్రుకలు తోసుకొచ్చిన గియ్యని గడ్డంతో ఉన్న ముఖాన్ని తుడుచుకొని, లుంగీ ఎగగట్టి అడిగేడు. "ఏమిటిమ్మంటావు?" కారా కిల్లీ నములడంవల్ల పళ్ళ జీరలు కట్టేయి. రెండు పళ్లు ముందుకు తోసుకవచ్చి మాట్లాడినప్పుడు తుంపర్లు పడుతున్నాయి.

"రెండు టీ!" జవాబిచ్చేడా మనిషి, ఖరీదైన 'డిష్'లు ఆర్డరు చేస్తున్నట్టు.

నాయరు టీ చేస్తూవుండగా, క్రీగంట చూసిందా మనిషిని. ఆ ఎత్తూ, బలమూ చూస్తే భయంవేసింది కాళిందికి. నీరసంవల్ల కాళ్లు తేలిపోతున్నాయి. ఈ మనిషి బతికి బయటపడనిస్తాడూ? ఆమెకు చెమట్లుపోసేయి.

నాయరిచ్చిన టీ తాగి ఇద్దరూ బయటపడ్డారు. అరిగిపోయిన పావలా బిళ్ల

చెల్లదని నాయరు పేచీపెట్టేడు కాని ఈ మనిషి దబాయించేడు. మరి నోరెత్తకుండా ఆ పావలా పెట్టెలో వేసుకున్నాడు నాయరు, గొణుక్కుంటూ కాళింది కేసి కోపంగా చూసి.

నడుస్తూనే నడుంచుట్టూ చేతులు వేసి దగ్గరగా తీసుకున్నాడు. ఆ బలానికి ఎముకలు విరిగిపోతాయేమోనని భయంవేసింది. చేతులు ఆకురాయిలా మోటుగా ఉన్నాయి. అతడి చెయ్యి నడుముని నొక్కేస్తోంది. ఊపిరి బిగబట్టి ఓర్చుకుంది.

"పాకలోకి పదండి," అంది భయపడుతూ.

* * *

మంచంమీంచి లేవడానికి ప్రయత్నించింది కాని లేవలేకపోయింది. ఒళ్ళంతా ఒక ఇనపమరలో పెట్టి పిండేసినట్టు, పిప్పిపిప్పిగా అయిపోయింది. దాహంతో గొంతు ఎండిపోతోంది. ఆ మనిషి లేచి, బట్టలు వేసుకొని, బయటికి వెళ్ళిపోతున్నాడు- శక్తినంతా కూడదీసుకొని లేచి, చీర చుట్టపెట్టుకొని అతన్ని వెంబడించింది కాళింది.

ఇద్దరూ బయట కొచ్చేరు.

డబ్బు సంగతి మాట్లాడడం లేదామనిషి. బైటకొచ్చేక అన్నాడు. "థాంక్స్! వస్తాను!" అంటూ ప్రేయసికి ప్రియుడు వీడ్కోలు చెప్పినట్టు చెప్పి పోబోతున్నాడు.

ఎండిపోతున్న గొంతుతో కాళింది అడిగింది. "డబ్బు మాట మర్చిపోయారు!"

అతను నిర్మోహమాటంగా అన్నాడు...."టీ ఇప్పించేను కదా ?" అని పోబోతున్నాడు.

వెన్నులో ఎవరో పొడిచినట్టయి కాళింది అరిచింది ఉబికివస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ. "రెండిప్పించండి చాలు! నా కొడుకు జ్వరంతో ఒళ్ళు తెలీకుండా పడున్నాడు. మీమీదే ఆశ పెట్టుకున్నాను....నా బాబుని రక్షించండి."

ఆ మనిషి ఆమెను తప్పించుకుని పోబోయేడు.

కాళిందిలో, ఇప్పటివరకూ అణిగిపోయిన, ఇన్నేళ్ళనించీ తలెత్తని ఆగ్రహం, కసి, అవమానం, రుద్రుడి మూడోకన్నునుంచి వచ్చిన మంటలా పెల్లుబికేయి. ఆమె అతడి ముందుకు వెళ్ళి, అతడి భుజాలు పట్టుకొని అరిచింది. "రాక్షసుడా! ఆటబొమ్మ ననుకున్నావురా ? కొనఊపిరితో విడిచిపెట్టేవ్ నన్ను! నా కొడుకుని చంపుదామనుకుంటున్నావా ? డబ్బు ఇచ్చి వెళ్ళు. రెండుకాదు! నీ దగ్గరున్నదంతా ఇచ్చినా నా దగ్గర తీసుకున్నదానికి సాటిరాతుందా ?" ఆమె అరుస్తోంది

ఒళ్ళుతెలియని ఆవేశంతో. అతడు విడిపించుకపోదామని ప్రయత్నిస్తున్నాడు. ఆమెపట్టు వదలడం లేదు.

రెండోఆట అప్పుడే వదిలేరు. ఈ కేకలు విని రోడ్డంటపోయే జనం ఇటు రాసాగేరు, "ఏంటయింది....ఏంటయింది" అంటూ.

ఆ మనిషి నిశ్చలమైన గొంతుతో అన్నాడు. "నేనూ మీలానే సినిమానించి వస్తూఉంటే పట్టుకుంది ఇక్కడ. దీన్తో నేను ఉన్నానుట. నా దగ్గరున్న డబ్బంతా పెట్టమంటోంది దొంగముండ!"

"ఏమిటి!? ఎంత దారుణం!! ఏంటే నంజా? యిది మర్యాదస్తులు తిరిగే జాగా అనుకున్నావా, దొమ్మరిగూడెం అనుకున్నావా?" ఒకరిద్దరు కలుగజేసుకున్నారు.

కాళిందికీ మాటలు బాధ కలిగించలేదు. ఆ స్థితి దాటిపోయింది. సిగ్గూ, లజ్జా, మానాభిమానాలు ఏనాడో మంటగలిసిపోయేయి. ఇప్పుడు నిలుపుకోవలసింది కొడుకు ప్రాణం ఒక్కటే.

ఆమె అరిచింది. "అబద్ధం. మీరా మాటలు నమ్మకండి బాబూ! కావలిస్తే వాయప్పని అడగండి. హోటలుకు తీసుకెళ్ళేడో లేదో తెలుస్తుంది. రాత్రి పన్నెండునించి ఇప్పటివరకూ పాకలో ఉన్నాడు నాతో....డబ్బులివ్వకుండా పోదామని చూస్తున్నాడు! నిన్ను కదల్నివ్వను....డబ్బివ్వందే పోనివ్వను!" కాళింది అతనిచొక్కా పట్టుకుంది.

ఇంక ఆలసిస్తే లాభంలేదని ఆమెచేతులు తన ఇనుపహస్తాల్లో బంధించి, పిండి, ఆమెని ఒక బొమ్మని ఎత్తినట్టు మీదకెత్తి పక్కకి విసిరేడు. కుప్పలా నేలమీద పడింది కాళింది. నుదుటికి మెట్లంచు తగిలి రక్తం కారుతోంది. తెలివి తప్పిపోతూన్నట్టుంది. కాని లేచింది. పోబోతున్న అతడ్ని పట్టుకొని, అతని ఛాతీమీద తన శక్తిలేని పిడికిలితో మోదింది.

ఆ మనిషి గట్టిగా అరిచేడు. "పోలీస్! పోలీస్!" అని. అందరూ రామనామం జపిస్తున్నట్టుగా అరిచేరు "పోలీస్! పోలీస్!" అని. "ఉండు దొమ్మరినంజా! నిన్ను పోలీసులకప్పచెప్తే రోగం కుదిరిపోతుంది. ఆళ్ళు రెండునెల్లు కటకటాల వెనుక పెడ్తేస్తే, నీ బలుపు తీరిపోద్ది." ఆ మనిషి కేకలేస్తున్నాడు.

"ఏటీ అన్నాయం!! ఇయ్యాళ బాబుకయింది రేపు మనకవుద్ది! యీ దొమ్మరి ముండలీ ఊరి పరువు మంటకలుపుతున్నారు!"

ఇంతలో, ఎవడో వీధి మొగంలోకి వెళ్ళి ఇద్దరు పోలీసుల్ని కేకేసుకొని

వచ్చేడు. పోలీసులు పరిగెడుతూ రావడం చూసిన కాళింది అతడ్ని వదిలి పరుగు తీసింది, వాళ్ళబారినుండి తప్పించుకొందుకి.

ఏదో లీలగా ఆమె మెదడు పనిచేస్తోంది. స్పృహపోతున్నట్టే ఉంది. కాని స్పృహపోకుండా ఉండేందుకు స్పృహపోయేలోపున, వీళ్ళ బారినుండి తప్పించుకుని కొడుకుదగ్గరికి ఎలాగయినా పోయి వాలాలని, ఆమె మిగిలిన కాస్త శక్తిని కూడదీసుకొని పరుగెత్తింది. పోలీసులకి దొరికితే రెండుమూడు నెలలవరకూ ఇంటి మొహమే చూడ్డం అవదు. బాబు మరి బతకడు. ఈ రాత్రి మరి గడవదు. మరి తెల్లవారదు. ఈ ఆలోచనలన్నీ లీలగా వస్తున్నాయి. నిజానికి ఆమెకి ఒంటిమీద స్పృహపోయింది. ఆమె తెగించి పరిగెడుతోంది.

పోలీసులు, మనుషులు ఆమెను వెంబడించేరు. "పట్టుకోండి! పట్టుకోండి," అంటూ కేకలేస్తూ.

ఆ కేకలు విని ఆమె పరుగెత్తేవేపునుంచి కొంత జనం ఎదురుగా వచ్చేరు. కాని ఆమె ఆగలేదు.

ఆ ఊపునే గిరుక్కున తిరిగి రోడ్డువదలి కాలువవేపు పరుగెత్తింది

ఆమె చీర పీడిపోయింది.ఆమె పూర్తిగా వివస్త్ర అయి అలానే పరుగెత్తింది పిచ్చిదాన్లా రాళ్లు రప్పలు, గాజుపెంకులు, ముళ్లు, గోతులు ఇవేవి ఆమెని బాధిస్తున్నా గ్రహించే స్థితిలో మెదడు లేదు. ఎన్నోసార్లు పడింది, లేచింది. రక్తం కారుతోంది.

ఆమెకు వినిపిస్తున్నదొక్కటే. కుందేలుని వెన్నంటే రేచుకుక్కల్లా అరుస్తూ వెంటబడుతున్న జనం హోరు!

ఆ జనంలోంచి ఎవరో కేకవేసేరు. "అటు కాలవవుంది! ఎళ్ళకు! ఆగిపో! ఆపండయ్యా ఆ మనిషిని!" కాని ఆ గొంతు తక్కిన గోలలో కలిసిపోయింది.

కాళింది ఆగలేదు! నేలమీద పరుగెడుతున్నట్టు పరుగెడుతూపోయి దబీమని నీటిప్రవాహంలో పడింది. ఈదడానికి ప్రయత్నించింది. నేలని అనుకుందుకి ప్రయత్నించింది. గిలగిల కాళ్లూచేతులూ కొట్టుకుంది. ఆఖరికి అశక్తురాలై స్పృహకోల్పోయి ఆ ప్రవాహంలో మునిగిపోయింది

ఒక్కసారి తేలినప్పుడు ఆమె గొంతు ఆఖరిసారిగా దేవుడ్ని ఉద్దేశించినట్లు నీరసంగా వినిపించింది. "దేవుడా! నా బాబుని కాపాడు!"

ఆమె నివేదన ఆమె మనస్సుని చీల్చుకొని ఈ ప్రపంచపు హద్దులుదాటి స్వర్గంలోని దేవుడ్ని చేరుకుందుకి ప్రయత్నించింది కాని, దేవుడే ఉంటే నిద్ర పోతున్నాడు.

———